AKSHARA TODAY

అక్షర టుడే

TOWARDS... TRUTH. TRUST. TREND

www.aksharatoday.in


## బీడీ స్కాలర్‌షిప్‌కు దరఖాస్తు చేసుకోవాలి

**అక్షరటుడే, భీమ్‌గల్:** ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్ పాఠశాలల్లో చదువుతున్న బీడీ కార్మికుల పిల్లలు స్కాలర్‌షిప్ కోసం దరఖాస్తు చేసుకోవాలని ఎంఈవో బట్టు రాజేశ్వర్ సూచించారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరానికి గాను ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. 1 నుంచి 10 తరగతి విద్యార్థులు ఆగస్టు 31లోగా, ఇంటర్, డిగ్రీ, ఆపై కోర్సులు చదివేవారు అక్టోబర్ 31 వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. మెమో, బ్యాంక్ పాస్‌బుక్, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, బీడీ కార్మికులి గుర్తింపు కార్డు, అపాయింట్‌మెంట్ లెటర్‌తో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సందేహాలుంటే హెల్ప్‌లైన్ నంబర్ 0120 - 6619540 నంబర్‌తో పాటు దగ్గరలో ఉన్న బీడీ కార్మికుల దవాఖానాలో సంప్రదించవచ్చన్నారు.





నగరంలోని తిలక్ గార్డెన్‌లో

# భక్తిశ్రద్ధలతో నాగుల పంచమి

ఉమ్మడి జిల్లాలో నాగుల పంచమిని మహిళలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఉదయం నుంచి పుట్టల వద్దకు చేరుకుని పాలు పోశారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. నగరంలోని ఐటీఐ, నాగేంద్రుడి గుడి, తిలక్‌గార్డెన్, వినాయక్‌నగర్, కంఠేశ్వర్, ఆర్మూర్, బాల్కొండ, బోధన్ కామారెడ్డి, బాన్సువాడ, ఎల్లారెడ్డి ప్రాంతాల్లో పుట్టలలో పాలు పోసి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం తమ సోదరులకు కళ్లు కడిగారు. పలు స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో ఆవుపాలను మహిళలకు ఉచితంగా అందజేశారు. – అక్షరటుడే, నెట్‌వర్క్

– మిగతావి 2 లో



బాన్సువాడ మండల కేంద్రంలో..

## బీజేపీ అంటే బీఆర్ఎస్‌పై కక్ష, కాంగ్రెస్‌కు రక్ష



**అక్షరటుడే, ఆర్మూర్ :** బీజేపీ నేతల తీరు బీఆర్ఎస్‌పై కక్ష, కాంగ్రెస్‌కు రక్ష అన్నట్లు ఉందని ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి ఎద్దేవా చేశారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. సీఎం రమేష్ అంటే చీటింగ్, మనీ లాండరింగ్ అని మండిపడ్డారు. తెలంగాణతో పాటు కర్ణాటక, మహారాష్ట్రలో కాంగ్రెస్ నేతలతో కలిసి అక్రమ దందాలతో డబ్బు కూడబెట్టుకున్నారని, తనపై ఈడీ, ఐటీ దాడులు తప్పించుకునేందుకు బీజేపీ పంచన చేరాడన్నారు. హెచ్‌సీయూ భూములు తాకట్టుపెట్టి రూ.10వేల కోట్ల అప్పు తేవడంలో రేవంత్ సర్కారుకు దళారిగా పని చేశాడని ఆరోపించారు. అందుకు ప్రతిఫలంగా ఫ్యూచర్ సిటీ పేరుతో రేవంత్ ఆడుతున్న అవినీతి ఆటలో రూ.1300 కోట్ల టెండర్లు దక్కించుకున్నారని, అందుకు కృతజ్ఞతగా సీఎం రమేష్ చంద్రబాబు, రేవంత్ తరపున వకాల్తా పుచ్చుకుని బీఆర్ఎస్‌పై విషం కక్కుతున్నాడని విమర్శించారు. సీఎం రమేష్‌ను హైదరాబాద్‌లో కాలుపెట్టకుండా తరిమికొడతామని హెచ్చరించారు.

## శ్రీరాంసాగర్‌కు భారీ వరద

**అక్షరటుడే, ఆర్మూర్:** నాలుగు రోజుల పాటు కురిసిన వర్షాలతో తెలంగాణ వరప్రదాయని శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి భారీగా ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రస్తుతం జలాశయంలో 1,05,000 క్యూసెక్కుల ఇన్ ఫ్లో వస్తోంది. ప్రాజెక్టు పూర్తి నీటిమట్టం 80.5 టీఎంసీలు (1091 అడుగులు) కాగా ప్రస్తుతం 32.897 టీఎంసీలకు (1075 అడుగులు) చేరింది. నిజామాబాద్, నిర్మల్ జిల్లాలో కురుస్తున్న వర్షాలతో ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో వస్తోంది. మంగళవారం ఉదయం ఆరు గంటల వరకు 89,812 క్యూసెక్కుల ఇన్ ఫ్లో రాగా.. 6 గంటల తర్వాత 75,754 క్యూసెక్కులకు పెరిగింది. ఆ తర్వాత 1,05,000 క్యూసెక్కులకు పెరిగింది. దీంతో ప్రాజెక్టు నీటిమట్టం వేగంగా పెరుగుతోంది. ఆవిరి రూపంలో 407 క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. గత యేడు ఇదే సమయానికి ప్రాజెక్టులో 1075.2 అడుగులు, 33.317 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

# బోనస్ కోసం ఎదురుచూపులు



- యాసంగిలో సేకరించిన ధాన్యానికి ఇంకా చెల్లించని వైనం
- జిల్లాలో పెరిగిన సన్నాల సాగు విస్తీర్ణం
- ప్రభుత్వం ఎలాంటి ప్రకటన చేయకపోవడంతో అన్నదాతల ఆందోళన

**వానాకాలం నాట్లు పూర్తయ్యాయి. అయినా కూడా యాసంగిలో కొనుగోలు చేసిన ధాన్యానికి ప్రభుత్వం ఇంకా బోనస్ డబ్బులు చెల్లించలేదు. తాము అధికారంలోకి వస్తే ధాన్యానికి క్వింటాలుకు రూ.500 బోనస్ ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. అధికారం చేపట్టాక సన్నాలకు బోనస్ ఇస్తామని తెలిపింది. ఈ మేరకు గత వానాకాలం సీజన్‌లో రైతులకు బోనస్ చెల్లించారు. దీంతో యాసంగిలో జిల్లావ్యాప్తంగా రైతులు ఎక్కువ మొత్తం సన్నరకం ధాన్యం సాగు చేశారు. అయితే కొనుగోళ్లు పూర్తయి రెండు నెలలు కావొస్తున్నా అన్నదాతల ఖాతాల్లో బోనస్ డబ్బులు జమ కాలేదు.**

– అక్షరటుడే, ఇందల్వాయి



జిల్లాలో యాసంగిలో 606 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. వీటి ద్వారా 8.40 లక్షల టన్నుల ధాన్యం సేకరించారు. రాష్ట్రంలో ధాన్యం సేకరణలో జిల్లా అగ్రస్థానంలో నిలిచింది. మొత్తం రూ.1949 కోట్ల విలువైన ధాన్యాన్ని రైతుల నుంచి కొనుగోలు చేశారు. ఇందులో 7,38,662 మెట్రిక్ టన్నులు సన్నరకం కాగా, 1,01, 481 మెట్రిక్ టన్నులు మాత్రమే దొడ్డు రకం. ఈ లెక్కన బోనస్ కింద జిల్లాకు రూ.369 కోట్లు రావాల్సి ఉంది.

### బోనస్‌పై ఆశతో..

జిల్లాలో గతేడాది యాసంగిలో 4.28 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే సేకరించారు. ఈ యాసంగిలో ఏకంగా 8.40 లక్షల టన్నులు కొనుగోలు చేశారు. అంటే గతేడాది పోలిస్తే దాదాపు రెట్టింపు స్థాయిలో కొనుగోలు చేశారు. దీనికి కారణం ప్రభుత్వం సన్న రకాలకు బోనస్ డబ్బులు చెల్లిస్తామని చెప్పడమే. వానాకాలం సీజన్‌లో బోనస్ చెల్లించడంతో రైతులు యాసంగిలో ఎక్కువ శాతం సన్నాలను సాగు చేశారు. గతంలో బయట మార్కెట్‌లో కొందరు రైతులు ధాన్యం విక్రయించేవారు. అయితే కొనుగోలు కేంద్రాల్లో అమ్మితే బోనస్ వస్తుందని ఈ సారి మొత్తం ప్రభుత్వానికి అమ్మారు. దీంతో అధికారులు రికార్డు స్థాయిలో ధాన్యం సేకరణ చేపట్టారు. అయితే ప్రభుత్వం బోనస్ చెల్లించకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

### సన్నాల సాగుకు శ్రమ అధికం

దొడ్డు రకం ధాన్యంతో పోలిస్తే సన్న రకం సాగు చేయడానికి కాస్త శ్రమ, పెట్టుబడి అధికంగా ఉంటుంది. సన్నాలకు ఎక్కువగా తెగుళ్లు వస్తాయి. దీంతో పురుగు మందులకు ఖర్చు చేయాలి. అలాగే దిగుబడి కూడా కొంచెం తక్కువగా వస్తుంది. అయినా బోనస్ ఇస్తే లాభం వస్తుందని రైతులు జిల్లాలో సన్నాలను సాగు చేస్తున్నారు. అయినా ఇప్పటికీ బోనస్ చెల్లించకపోవడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వెంటనే బోనస్ డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు.

### రూ.65 వేలు రావాలి



ప్రభుత్వం బోనస్ డబ్బులు చెల్లిస్తే వానాకాలం పెట్టుబడికి సహాయంగా ఉంటుంది. యాసంగి సీజన్‌లో కొనుగోలు కేంద్రంలో 130 క్వింటాళ్ల సన్న వడ్లు అమ్మాను. బోనస్ కింద రూ.65 వేలు రావాల్సి ఉంది.

– కనుగొందుల భూమయ్య, రైతు, చంద్రాయన్‌పల్లి

### తొమ్మిది ఎకరాల్లో సాగు



ప్రభుత్వం బోనస్ ఇస్తుందనే ఆశతో యాసంగిలో తొమ్మిది ఎకరాల్లో సన్న రకం వరి సాగు చేశా. పంటలకు రోగాలు రావడంతో మందుల పిచికారీకి అధికంగా ఖర్చు చేయాల్సి వచ్చింది. సన్న రకం పంటకు శ్రమ అధికం గా ఉంటుంది. బోనస్ జమ చేస్తే శ్రమకు తగ్గ ఫలితం లభిస్తుంది. –లాల్ సింగ్, సామ్యా నాయక్ తండా

## ప్రజారోగ్య రక్షణ బాధ్యత అధికారులదే..



**అక్షరటుడే, ఆర్మూర్:** ప్రజారోగ్యాన్ని కాపాడాల్సిన బాధ్యత అధికారుల పైనే ఉందని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి పేర్కొన్నారు. మాక్లూర్ మండల కేంద్రంలో మంగళవారం పర్యటించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, అంగన్‌వాడీ సెంటర్, ఎంఈవో కార్యాలయం, వ్యవసాయ సహకార సంఘం ఎరువుల గోడౌన్, శాఖా గ్రంథాలయం, సబ్ పోస్టాఫీస్ తదితర కార్యాలయాలను తనిఖీ చేశారు. గ్రామ పంచాయతీ కార్యదర్శితో మాట్లాడి ఇందిరమ్మ ఇళ్ల ప్రగతి వివరాలను తెలుసుకున్నారు. ముందుగా మాక్లూర్ పీహెచ్‌సీని కలెక్టర్ సందర్శించారు. ఓపీ రిజిస్ట్రేషన్ కౌంటర్, ల్యాబ్, ఇన్ పేషెంట్ వార్డు, వ్యాక్సినేషన్ రూమ్ తదితర విభాగాలను తనిఖీ చేశారు. మెడికల్ ఆఫీసర్‌తో పాటు, విధుల్లో ఉన్న సిబ్బంది హాజరును పరిశీలించారు. ఆరోగ్య కేంద్రం ద్వారా ప్రజలకు అందిస్తున్న వైద్య సేవల గురించి ఆరా తీశారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ పీహెచ్‌సీ సిబ్బందికి సూచించారు. పాముకాటు మందు, ఇతర అన్ని రకాల ఔషధాలు అందుబాటులో ఉండాలని సూచించారు. కలెక్టర్ వెంట అధికారులు ఉన్నారు.

## 'లబానా'లను ఎస్టీ జాబితాలో చేర్చాలి



గిరిజనశాఖ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న లబానా సమాజ్ సభ్యులు

**అక్షరటుడే, కామారెడ్డి:** లబానా లంబాడీలను ఎస్టీ జాబితాలో చేర్చాలని లబానా సమాజ్ కాయితి లంబాడీల రాష్ట్ర అధ్యక్షుడు తాన్ సింగ్ నాయక్ కోరారు. ఉమ్మడి నిజామాబాద్, ఆదిలాబాద్ లబానా సమాజ్ కాయితి లంబాడీల నాయకులు శాస్త్రవేత్త పైడి ఎల్లారెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం ఢిల్లీలోని కేంద్ర గిరిజన శాఖ కమిషనర్ నిరుపమ్ చక్మా, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, ఎంపీ ఈటల రాజేందర్‌లను కలిశారు. ఈ సందర్భంగా లబానా లంబాడీల సమస్యలను వారికి వివరించారు. గతంలో చెల్లప్ప కమిషన్ ఇచ్చిన నివేదికను వివరించారు. కార్యక్రమంలో లబానా సమాజ్ నాయకులు దశరథ్ నాయక్, నర్సింగ్, బోథ్ మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ నారాయణ్ సింగ్, బద్ధు, రాంసింగ్ పాల్గొన్నారు.

## గత ప్రభుత్వం ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదు..: మంత్రి

**అక్షరటుడే, కామారెడ్డి:** పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క అన్నారు. దోమకొండలో మంగళవారం నిర్వహించిన రేషన్ కార్డుల పంపిణీ, ఇందిరా శక్తి మహిళా సంబురాల్లో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలో మహిళలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు రేషన్ కార్డులు ఇచ్చిందని.. మళ్లీ తామే అధికారంలోకి వచ్చాక మంజూరు చేస్తున్నామని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు మహిళల పేరు మీద ఇస్తున్నామని మంత్రి వివరించారు. మహిళలు సంతోషంగా ఉంటేనే సమాజం, కుటుంబం బాగుంటుందన్నారు. అందుకే తమ ప్రభుత్వం ఏర్పడ్డ తొలినాళ్లలోనే మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించామని చెప్పారు.



దోమకొండలో మహిళా సంఘాల సభ్యులకు రుణాల చెక్కులను పంపిణీ చేస్తున్న మంత్రి సీతక్క

దేశంలో ఎక్కడా లేని విధంగా పేదింటి బిడ్డల కోసం రూ.500లకే గ్యాస్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నామని పేర్కొన్నారు. ప్రస్తుతం మహిళా సంఘ సభ్యులకు వడ్డీ భారం పడకుండా రూ. 26వేల కోట్లు ఇస్తున్నామని మంత్రి స్పష్టం చేశారు. రూ. కోటి స్త్రీనిధి అందిస్తున్నామని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ మాట్లాడుతూ పదమూడేళ్ల తర్వాత రాష్ట్రంలో మళ్లీ కొత్త రేషన్ కార్డుల పంపిణీ జరుగుతోందని తెలిపారు. జిల్లాలో దాదాపు 4వేలకుపైన రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్నట్లు వివరించారు. ఇది నిరంతర ప్రక్రియ అని చెప్పారు. అనంతరం వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా మొక్కలను నాటారు. కార్యక్రమంలో కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, అదనపు కలెక్టర్ విక్టర్, మార్కెట్ కమిటీ ఛైర్మన్ పాత రాజు, అధికారులు పాల్గొన్నారు.





## పొలంలో దిగి.. నాట్లు వేసి..

**తరగతిలో పాఠాలు నేర్చుకునే విద్యార్థులు.. పొలం బాట పట్టారు. విద్యార్థులంతా కలిసి నాట్లు వేశారు. కామారెడ్డి పట్టణ శివారులోని వరి సాగులో పాలు పంచుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. కామారెడ్డిలోని విశ్వభారతి స్కూల్ విద్యార్థులు మంగళవారం పొలానికి వెళ్లారు. అక్కడ వరి నాట్లు వేశారు. అనంతరం పొలం వద్దనే సహపంక్తి భోజనాలు చేశారు.**

–అక్షరటుడే, కామారెడ్డి



## బీహార్‌లో 1949 యాక్ట్ రద్దు చేయాలి



**అక్షరటుడే, బోధన్:** బీహార్ రాష్ట్రంలో 1949 యాక్ట్ రద్దు చేయాలని బుద్ధిస్ట్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం బుద్ధిస్ట్, బౌద్ధ భిక్షువుల ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టారు. ఆచన్‌పల్లి నుంచి బోధన్‌లోని అంబేద్కర్ చౌరస్తా వరకు ర్యాలీగా వచ్చారు. ఈ సందర్భంగా బంతే బుద్ధా ఘోష్ మాట్లాడుతూ.. బీహార్‌లోని బోధిగయ పవిత్రమైన ధమ్మ భూమి అని.. కానీ, అదే భూమిలో బౌద్ధులు పరాయివారిలా ఉండాల్సి వస్తోందని ఆవేదనం వ్యక్తం చేశారు. ఇది భారత రాజ్యాంగానికి, బౌద్ధ ధమ్మానికి విరుద్ధమన్నారు. మహాబోధిని పూర్తిగా బౌద్ధుల ఆధీనంలోకి తెచ్చేలా దేశవ్యాప్తంగా బౌద్ధులు ఉద్యమం చేస్తున్నారని, ఇందులో భాగంగా భంతే బుద్ధగోష్ ఆధ్వర్యంలో, ఈనెల 21 నుంచి 10 రోజుల వరకు శ్రామణేర్ శిబిరం, శాంతియుత ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో భంతే నాగావజ్ర, టీబీఎస్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అశోక్ భాగ్యవాన్, సమత సైనిక్ దళ్ జిల్లా సంఘటకులు కపిల్, ది బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు దేవిదాస్, తదితరులు పాల్గొన్నారు.




# గాంధారి కేజీబీవీలో తాగునీటికి కటకట..!

- మరమ్మతులకు నోచుకోని వాటర్ ప్లాంట్
- ప్రైవేట్ ప్లాంట్ నుంచి తాగునీరు
- పట్టించుకోని అధికారులు

**గాంధారి మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలలో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. తాగునీటికి సైతం ఇబ్బందులు తప్పడం లేదు. పాఠశాలలో వాటర్ ప్లాంట్ ఉన్నా.. మరమ్మతులకు నోచుకోవడం లేదు. దీంతో విద్యార్థులకు ప్రైవేటు వాటర్ ప్లాంట్ నీరు తెప్పిస్తున్నారు. ఫలితంగా ప్రతినెలా అదనంగా వ్యయ భారం అవుతుందని ప్రిన్సిపాల్ పేర్కొంటున్నారు.** – అక్షరటుడే, గాంధారి

గాంధారి మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలలో ఐదేళ్ల కిందట వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేశారు. అయితే రెండేళ్లుగా పని చేయకపోవడంతో మూలకు చేరింది. గతంలో అప్పటి కలెక్టర్ జితేష్ వి పాటిల్ ప్లాంట్ బాగు చేయించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అయినా.. మరమ్మతులకు నోచుకోలేదు. తాజాగా.. ప్రస్తుత కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేయగా, వాటర్ ప్లాంట్ పరిశీలించి బాగు చేయించాలని సూచించారు. అయినా.. ఇప్పటికీ మోక్షం లభించడం లేదు. ప్లాంట్ మరమ్మతు కోసం రూ.60 వేల వరకు వ్యయం అవుతుందని ప్రిన్సిపాల్ ఉన్నతాధికారులకు తెలుపగా, ఎలాంటి స్పందన లేదు. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో బయట నుంచి ప్రైవేటు మినరల్ వాటర్ నీటిని కొనుగోలు చేసి విద్యార్థులకు అందిస్తున్నారు.

### ప్రైవేట్ వాటర్ ప్లాంట్ నీటిని అందిస్తున్నాం..

పాఠశాలలో వాటర్ ప్లాంట్ మరమ్మతులకు నోచుకోకపోవడంతో ప్రైవేటు వాటర్ ప్లాంట్ నుంచి నీటిని తీసుకువచ్చి విద్యార్థులకు అందిస్తున్నాం. త్వరలోనే మరమ్మతులు చేయిస్తాం.

– శిల్ప, కస్తూర్బా ప్రిన్సిపాల్

# భక్తిశ్రద్ధలతో నాగుల పంచమి


నగరంలోని పెద్ద పోచమ్మ ఆలయంలో..


నగరంలోని న్యాల్‌కల్ రోడ్డులో..


పిట్లంలో..


పాతంగల్ మండల కేంద్రంలో




నగరంలో పుట్ట వద్ద పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్సీ ఆకుల లలిత


నిజాంసాగర్ మండల కేంద్రంలో..



పిట్లంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో..




ఇందల్వాయి మండలంలోని చంద్రాయన్‌పల్లిలో..


నగరంలోని ఐటీఐ కళాశాల ఆవరణలో..






ఆలూర్‌లో నాగుల పంచమి వేడుకలు


నగరంలోని నాగేంద్ర గుడి ఆలయంలో భక్తుల బారులు


బోధన్ పట్టణంలో..


కామారెడ్డిలో నాగుల పంచమి వేడుకలు

## గజానంద్ సోన్ కాంబ్లేను సన్మానించిన ఎంపీడీవో



**అక్షరటుడే, నిజాంసాగర్:** జుక్కల్ మండలంలోని లొంగన్ గ్రామానికి చెందిన గజానంద్ సోన్ కాంబ్లేను ఎంపీడీవో శ్రీనివాస్ ఘనంగా సన్మానించారు. ఇటీవల గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా ఆర్థికశాస్త్రంలో గజానంద్ సోన్ కాంబ్లే బంగారు పతకాన్ని సాధించారు. ఈ సందర్భంగా ఆయనను జుక్కల్‌లోని గ్రంథాలయ ఆవరణలో సోమవారం ఎంపీడీవో సన్మానించారు. ఆయనతో పాటు గ్రంథాలయ పాఠకులు, యువకులు గ్రామస్థులు పాల్గొన్నారు.

## ఆర్మూర్ అభివృద్ధికి నిధులివ్వాలి



**అక్షరటుడే, ఆర్మూర్ :** ఆర్మూర్ నియోజకవర్గ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డి మంత్రి సీతక్కను కోరారు. ఈ మేరకు మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశానికి మంత్రి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాకేశ్ రెడ్డి ఆమెకు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. అనంతరం ఆర్మూర్ నియోజకవర్గ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని మంత్రిని కోరారు.

## ప్రగతిశీల యువజన సంఘం రాష్ట్ర నాయకుడిగా రవి

**అక్షరటుడే, ఆర్మూర్ :** సీపీఐఎంఎల్ ప్రజాపంథా నాయకుడు బట్టు రవి ప్రగతిశీల యువజన సంఘం రాష్ట్ర నాయకుడిగా ఎన్నికయ్యారు. ఈ మేరకు రాష్ట్ర కార్యవర్గంలో ఆయనకు చోటు కల్పిస్తూ మంగళవారం ఎన్నుకున్నారు. బట్టు రవి యువజన పోరాటంలో క్రియాశీలకంగా వ్యవహరించడంతో, గుర్తించిన రాష్ట్ర నాయకత్వం కమిటీలో చోటు కల్పించింది. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ.. సమాజంలో యువత మత్తుకు దూరంగా ఉండాలని సూచించారు.

## అర్ధరాత్రి వరకు షాప్ తెరిచిన ఒకరికి జైలు

**అక్షరటుడే,ఆర్మూర్:** పట్టణంలో అర్ధరాత్రి వరకు దుకాణాన్ని తెరిచి ఉంచినందుకు ఒకరికి న్యాయస్థానం జైలుశిక్ష విధించింది. ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ వద్ద ఖలీల్ అనే వ్యక్తి అర్ధరాత్రి వరకు దుకాణం నిర్వహిస్తున్నాడు. దీంతో పోలీసులు అదుపులోకి తీసుకుని మార్నింగ్ కోర్టులో హాజరుపర్చగా విచారించిన న్యాయమూర్తి ఏడురోజుల శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెల్లడించారని ఎస్‌హెచ్‌వో తెలిపారు.

## గుర్తుతెలియని వ్యక్తి మృతి

**అక్షరటుడే నిజామాబాద్ సిటీ:** నగరంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన వీక్లీ మార్కెట్‌లో మంగళవారం చోటు చేసుకుంది. ఒకటో టౌన్ ఎస్‌హెచ్‌వో తెలిపిన వివరాల ప్రకారం.. వీక్లీ మార్కెట్ కల్లుదుకాణం వద్ద ఓ వ్యక్తి అపస్మారక స్థితిలో పడిఉన్నాడనే సమాచారం రావడంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. వెంటనే సదరు వ్యక్తిని '108'లో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే ఆ వ్యక్తి మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. అతడి వయస్సు 45 ఏళ్ల నుంచి 50 ఏళ్ల వరకు ఉండవచ్చని.. గోధుమ రంగ్ షర్ట్, ఆరెంజ్ కలర్ స్వెట్టర్ వేసుకుని ఉన్నాడని వివరించారు. ఎవరికైనా సమాచారం తెలిస్తే ఒకటో టౌన్ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్సై సూచించారు.

## నూతన ఆవిష్కరణలతో సమాజానికి మేలు

**అక్షరటుడే, ఇందూరు:** ఎప్పటికప్పుడు నూతనంగా వచ్చే ఆవిష్కరణలు సమాజానికి మేలు చేస్తాయని గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామ్మోహన్ రెడ్డి అన్నారు. తెలంగాణ ఆవిష్కరణల విభాగం ఆధ్వర్యంలో మంగళవారం కళాశాలలో నూతన ఆవిష్కరణల పరిచయ కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ చదువుతో సంబంధం లేకుండా కూడా కొత్త ఆలోచనలతో ఎన్నో ఆవిష్కరణలు వస్తున్నాయన్నారు. వారిని ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. అనంతరం విద్యార్థులు రూపొందించిన వివిధ ఆవిష్కరణలను ప్రదర్శించారు. కార్యక్రమంలో డీఎస్‌వో గంగా కిషన్, విషయ నిపుణులు కృష్ణారెడ్డి, నరసింహా చారి, సమన్వయకర్త డాక్టర్ ముత్తెన్న, డాక్టర్ చంద్రశేఖర్, గ్రంథాలయాధికారి పూర్ణచందర్రావు ఎన్‌సీసీ అధికారి లెఫ్టినెంట్ డాక్టర్ రామస్వామి తదితరులు పాల్గొన్నారు.



## అదుపుతప్పి ఆటో బోల్తా.. పలువురికి గాయాలు



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** నగరంలో ఓ ఆటో అదుపుతప్పి బోల్తాకొట్టింది. ఈ ఘటన బోర్గాం(పి)లోని సంజీవరెడ్డి కాలనీలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కాలనీ నుంచి ఆటో నిజామాబాద్ నగరం వైపు వస్తుండగా.. మూలమలుపు వద్ద అదుపుతప్పి ఒక్కసారిగా బోల్తా పడింది. ఆ సమయంలో ఆటోలో ఉన్న నలుగురు ప్రయాణికులకు స్వల్పగాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న నాలుగో టౌన్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. సమాచారం సేకరించి